క్లుప్తంగా

ఘనంగా భగీరథ జయంతి



రామవరంలో భగీరథుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: మండలంలోని రామవరం సగరు పేటలో భగీరథ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం భగీరథుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భగీరథుని కీర్తిని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌ సీపీ నేతలు పాల్గొన్నారు

శంఖవరంలో...



శంఖవరంలో భగీరథుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ పర్వత రాజుబాబు, తదితరులు

శంఖవరం: స్థానిక సగర కాలనీలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథుని విగ్రహానికి ఎంపీపీ పర్వత రాజుబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గంగను భూమికి తీసుకురావడానికి భగరధుడు కఠినమైన తపస్సు చేశారన్నారు. భగరధుని తపస్సు వలన శివుడు గంగను తన జటాజూలల నుంచి భూమికి దింపారని తెలిపారు. కార్యక్రమంలో సగర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఏగులమ్మ తీర్థం



ఏగులమ్మ అమ్మవారి జాతరలో భక్తుల సందడి

ప్రత్తిపాడు: గ్రామ దేవత ఏగులమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాణాసంచా కాల్పులు, గరగల నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బుట్టబొమ్మల, బోనాల నృత్యాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సమీప గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పందుల సంచారంతో అసౌకర్యం



మురికి గుంతల్లో దొర్లుతున్న పందులు

ఏలేశ్వరం: పట్టణంలో పందులు విచ్చలవిడిగా సంచరించడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇవి గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. వీటితో వ్యాధులు వచ్చే ప్రమాదం ఉండడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. స్థానిక తోట వీధి, పల్లపువీధి, దిబ్బలపాలెం, తదితర ప్రాంతాల్లో వీటి సంచారం ఎక్కువగా ఉంది. గతంలో వీటిని నియంత్రించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టిన ఫలితం కానరాలేదు. ప్రస్తుతం డ్రెయిన్లు, మురికి గుంతల్లో పందులు గుంపులుగా దొర్లడంతో దుర్గంధంతో పాటు మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:	
తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540
కిర్లంపూడి:	
తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269



ఏలేశ్వరంలో రహదారిపై నిలిచిపోయిన వర్షపునీరు



కాత్రావులపల్లిలో ధాన్యం వర్షానికి తడిసిపోవడంతో దిగాలుగా ఉన్న రైతులు



తుని పట్టణంలో కురుస్తున్న వర్షం, రోడ్డుపైకి చేరిన నీరు

అకాల వర్షం.. అపార నష్టం

- కుండపోత వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం
- ఆందోళన చెందుతున్న రైతులు
- పంట ఒబ్బిడిలో బిజీబిజీ

జగ్గంపేట: అకాల వర్షం జగ్గంపేట నియోజకవర్గంలోని వరి రైతులను ముంచేసింది. ఆరుగాలం శ్రమించి, కోత కోసి మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని రెండు రోజుల్లో మిల్లులకు తరలించవలసి ఉండగా అకాల వర్షానికి తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరలించిన ధాన్యాన్ని మిల్లురు తక్షణమే దింపుకుని వాహనాలను వెనక్కి పంపకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు, ఆరబెట్టిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించేలా వాహనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నియోజకవర్గంలో...

జగ్గంపేట నియోజకవర్గంలోని జగ్గంపేట, కిర్లంపూడి, గోకవరం, గండేపల్లి మండలాల్లో సుమారు 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం నీట మునిగినట్లు తెలుస్తోంది. గత రెండు రోజులుగా మెట్ట ప్రాంతంలోని జోరుగా వర్షాలు కురవడంతో రైతులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కోతలు పూర్తయిన తరువాత జగ్గంపేట మండలంలోని కాత్రావులపల్లి, రామవరం గ్రామాల పరిధిలో ఖాళీగా ఉన్న లే అవుట్లు, ప్రదేశాల్లో రైతులు సుమారు 200 మెట్రిక్ టన్నుల ధాన్యం ఆరబెట్టారు. పక్క మండలాలైన పెద్దాపురం, గండేపల్లి కిర్లంపూడి మండలాల నుంచి కూడా రైతులు కాత్రావులపల్లి ప్రాంతంలోని



కాత్రావులపల్లిలో ధాన్యం రాశులపై కప్పిన బరకాలు

ఖాళీ ప్రదేశాలకు ధాన్యాన్ని తరలించి ఆరబెట్టారు. ఇది కూడా మరో 200 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంటుందని అంచనా. ఆదివారం ఉదయం ఒక్కసారిగా వర్షం పడడంతో రైతులు బరకాలు కప్పినా ప్రయోజనం లేదు. జగ్గంపేట మండలంలో 3 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తే 2500 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. దీనికి సంబంధించి 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మరో 500 ఎకరాల్లో వరిపంట కోతకు వచ్చింది. అకాల వర్షానికి దీనిలో 100 ఎకరాలకు పైగా పంట నేల వాలిపోయింది.

భారీ వర్షం

ఏలేశ్వరం: ఎండా కాలంలో వర్షాలు పడుతుండడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఉదయం నుంచి ఆకాశంలో కారుమబ్బులు అలముకోవడంతో మధ్యాహ్నం వరకూ వర్షం పడింది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రహదారులపై వర్షపునీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం నుంచి ఎండ కాయడంతో వాతావరణం సాధారణంగా మారింది.

గోకవరంలో భారీ వర్షం

గోకవరం: మెట్ట ప్రాంతమైన గోకవరం మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం 8 గంటల నుంచి మొదలుకొని మధ్యాహ్నం 11 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురుగాలులు వీయడంతో మామిడి నేలరాలింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోయారు.

తునిలో కుండపోత

తుని: అల్పపీడనం ప్రభావంతో కురిసిన కుండపోత వర్షంతో పంటలకు అపారనష్టం జరిగింది. ఆదివారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి పట్టణంలోని పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. కొండవారిపేట రైల్వే అండర్ పాస్ వద్ద భారీగా నీరు



ధాన్యం రాశిలో చేరిన నీటిని బయటకు పంపడానికి ప్రయత్నిస్తున్న రైతు

చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రధాన రోడ్లు నీటితో చెరువును తలపించాయి. జీఎస్‌టీ రోడ్డు సినిమా రోడ్డులో ఇటీవల తీసిన పూడిక వర్షం నీటికి మళ్లీ కాలవలోకి చేరింది. నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. చేతికి అందివచ్చిన పంట నీటిపాలు కావడంతో రైతులు ఆందోళన చెందారు. ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా కోరారు.

మిల్లర్ల నిర్లక్ష్యంతోనే..



ధాన్యం పూర్తిగా ఆరిపోయింది. వాహనాలు వస్తే ధాన్యం మిల్లుకు తరలించి ప్రశాంతంగా ఉండేవాళ్లం. వాహనాలు రాకపోవడంతో కళ్లాలో ధాన్యం ఆరబెట్టాం. ఇదే సమయంలో భారీ వర్షం పడి సుమారు 20 ఎకరాల్లో కోసిన 1000 బస్తాల ధాన్యం తడిసిపోయింది. మరో 20 ఎకరాల్లో కోతకు వచ్చిన వరిపంట నేలవాలింది. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. చాలా దారుణంగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది. మిల్లర్ల మాయంజాలం వల్లే దుస్థితి నెలకొంది. రేటు విషయంలో కూడా రూ.25 తగ్గిస్తున్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలి.

– ప్రతిపాటి శ్రీనివాస్, వరి రైతు, కాత్రావులపల్లి, జగ్గంపేట మండలం

ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలి



చేతికి అందివచ్చిన పంట వర్షానికి దారుణంగా దెబ్బ తింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలి. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని మంచి ధర ఇచ్చి కొనుగోలు చేసి రైతులను ఆదుకుంది. రైతుకు ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించేది. కూటమి ప్రభుత్వం రైతులకు ఏ రకంగానూ సహకారం అందించటం లేదు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయకపోతే రైతు కోలుకోవడం కష్టం.

– రావుల సురేష్‌కుమార్, రామవరం, జగ్గంపేట మండలం

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

జగ్గంపేట మండలంలో 200 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లు ప్రాథమికంగా గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక పంపాం. పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తున్నాం. వర్షం ఆగిపోతే పంటనష్టం తగ్గుతుంది. తడిసిన వరి పంటను కాపాడుకోవడానికి అవసరమైన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్నాం.

– రెడ్ల శ్రీరామ్, మండల వ్యవసాయాధికారి, జగ్గంపేట

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



రామవరం వద్ద తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తోట నరసింహం

- మాజీ మంత్రి తోట నరసింహం
- రామవరంలో తడిసిన ధాన్యం పరిశీలన

జగ్గంపేట: అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం తక్షణమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోయిందని తెలిపారు. జగ్గంపేట మండలం రామవరం వద్ద తడిసిన ధాన్యాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. చేతికొచ్చిన పంట భారీ వర్షానికి తడిసి ముద్దయిందని రైతులు వాపోయారు. నీటిలో ఉన్న ధాన్యాన్ని చూపించి తాము పడ్డ కష్టం నీటిపాలు అయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ రైతులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తక్షణమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. జగ్గంపేట మండలంలో 400 మెట్రిక్ టన్నులు, కిర్లంపూడి మండలంలో 600, గండేపల్లి మండలం 300, గోకవరం మండలం 200 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఆరోపించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చేతికి అందివచ్చిన వందలాది ఎకరాల్లో వరి పంట అకాల వర్షానికి నేల వాలిందన్నారు. తడిసిన ధాన్యాన్ని తేమశాతంతో సంబంధం లేకుండా తక్షణమే కొనుగోలు చేసి రైతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జగ్గంపేట మండల అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పబ్లిసిటీ విభాగం జాయింట్ సెక్రటరీ రామకుర్తి జగాల్, పార్టీ నేతలు గుర్రం మహాలక్ష్మి, భూమాడి గణపతి, సప్పా రఘు, కాపవరపు ప్రసాద్, రామవరం రైతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గోకవరం: మండలంలోని బావాజీ పేట లేఅవుట్ కాలనీలో శ్రీలలితా మెమోరియల్ ఫౌండేషన్ భవనం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీఎంపీ అసోసియేషన్ తూర్పు గోదావరి జిల్లా కోశాధికారి పెంటిమేను చిన్ని జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన శ్రీకర మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ బి.రోహిత్ కుమార్, డాక్టర్ ఎస్‌జె పృధ్వీకృష్ణ రోగులకు వైద్య సేవలందించారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సుమారు 200 మంది వైద్యసేవలు పొందారు. కార్యక్రమంలో భాగంగా పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, గంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనాలంటూ ఆందోళన



రాస్తారోకో చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

జగ్గంపేట: అకాల వర్షానికి నీట మునిగిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ జగ్గంపేట మండలం కాత్రావులపల్లిలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన జగ్గంపేట - పెద్దాపురం రోడ్డులో కాత్రావులపల్లి వద్ద ఆదివారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ, కలెక్టర్ సమీక్షలతో కాలక్షేపం చేయడం తప్ప, రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. రెండు రోజులుగా వర్షాలు కురిసి, మిల్లులకు తరలించాల్సిన ధాన్యం తడిసి ముద్దయినా కనీసం డివిజన్ స్థాయి అధికారులు కూడా రైతుల వద్దకు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం జిల్లా స్థాయి అధికారులు నీట మునిగిన ధాన్యాన్ని, వరి చేలను పరిశీలించాలని, నష్టపోయిన రైతులకు తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మిల్లర్లు, కమీషన్‌దార్లు కుమ్మక్కై మద్దతు ధర రూ.1,750 కాకుండా కేవలం రూ.1,250 ఇచ్చి రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు తాగునీటి ఇక్కట్లు



నీటి నిల్వలు తగ్గిపోవడంతో ఇసుక మేటలతో నిండిన ఏలేరు కాలువ

ఏలేశ్వరం: వేసవి ఎండలకు ఏలేరు కాలువలో నీటి సరాఫరా తగ్గుముఖం పట్టింది. దీంతో తాగునీటి కోసం కాలువపై ఆధారపడిన మూగజీవాలు నానా అవస్థలు పడుతున్నాయి. మండల వ్యాప్తంగా ఏలేశ్వరం, తిరుమాలి, యర్రవరం గ్రామాల మీదుగా సుమారు ఏడు కిలో మీటర్ల మేర ఏలేరు కాలువ ఉంది. ఏటా వేసవిలో ఆయా గ్రామాల్లోని పశువులు ఏలేరు కాలువలో నీటిపై ఆధారపడతాయి. రైతులు వేసవిలో కాలువలో వీటిని శుభ్రం చేసి తాగునీటి అవసరం తీర్చుతుంటారు. ప్రస్తుతం ఏలేరు జలశయంలో నీటినిల్వలు తగ్గుముఖం పట్టడంతో కాలువలో నీటి సరాఫరా తగ్గిపోయింది. కాలువలో సగానికిపైగా ఇసుక మేటలు వేశాయి. దీంతో తాగునీటి కోసం పశువులు అల్లాడుతున్నాయి. గ్రామాల్లో పశువులకు నీటితొట్టెలు నిర్మించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



32 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

గండేపల్లి: జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 32 ఏళ్ల తరువాత గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట సాయిబాలాజీ ఫంక్షన్ హాలులో కలుసుకున్నారు. సుమారు వంద మంది తమ కుటుంబాలతో హాజరై చిననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో ఉదయం నుంచి సాయింత్ర వరకూ ఆనందంగా గడిపారు. ఇకపై ఏటా కలుసుకుని ఆపదలో ఉన్నవారికి సహాయం అందించాలని తీర్మానించినట్టు తెలిపారు.

ప్రజలు ఇబ్బంది పడాల్సిందే !



ప్రత్తిపాడులో ప్రధాన రహదారికి అడ్డంగా వేసిన స్టేజీ

ప్రత్తిపాడు: జాతర జరిగితే ఊరంతా సంబరం చేసుకుంటారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. జాతర... జన జీవన స్రవంతికి ఇబ్బంది కలుగకుండా జరుపుకోవడం పరిపాటి. కానీ ప్రత్తిపాడులో మాత్రం కూటమి నేతల ఆంక్షల మధ్య జాతర జరుగుతోంది. అధికార టీడీపీ ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అధికారం తమ చేతుల్లో ఉండటంతో బరితెగించి, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారిలో ఆంక్షలు విధించారు. పోలీసులకు సమాచారం తెలిసినా నిమ్మకునీరెత్తనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో వేగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు జరుగుతున్నాయి. జాతర ముగింపు రోజైన ఆదివారం రాత్రి డీజే డ్యాన్స్ ఈవెంట్ ఏర్పాటు చేశారు. దీని కోసం పోలీస్ స్టేషన్‌కు అత్యంత సమీపంలో ప్రత్తిపాడు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన రహదారికి అడ్డంగా అతిపెద్ద స్టేజీనీ ఏర్పాటు చేశారు. స్టేజీని దాటివెళ్లకుండా రెండు పక్కలా కూడా దారి లేకుండా దిగ్బంధం చేశారు. పోలీస్ హెచ్చరిక బోర్డులు పెట్టి మరీ స్టేజీ ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానదారి మార్గం మూసివేయడంతో ఆర్టీసీ బస్సులు గ్రామంలోని ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌కు రాకుండా బైపాస్ మీదుగా పోతున్నాయి. దీని వల్ల ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి వెళ్లాలన్నా మార్గం బంద్ కావడంతో రోగులు, ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

గోకవరం: మండలంలోని శివరామపట్నంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో మేడే వారోత్సవాలు నిర్వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు కార్మిక జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులపై జరుగుతున్న నరమేథాన్ని వెంటనే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అడవిలో ఉన్న ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ పెట్టుబడి దారులకు, అంబానీ, అదానీల ప్రయోజనాల కోసం కేంద్రం పారామిలటరీ, బస్తర్ ఫైటర్స్‌తో సంయుక్తంగా ఆదివాసులపై దాడులు చేస్తూ అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేయడం సిగ్గుచేటన్నారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. శివరామపట్నంలో రెండున్నర దశాబ్దాలుగా నిరుపేదలు సాగు చేసుకుంటున్నా 34 ఎకరాల సీలింగ్ భూమికి పట్టాలు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, గ్రామస్తులు అప్పలరాజు, జి.బాబు, పెద్దకాపు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కార్మిక జెండాను ఆవిష్కరిస్తున్న కర్నాకుల వీరాంజనేయులు

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వైశాఖ శుద్ధ అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీకారం చుట్టారు. అధిక సంఖ్యలో భక్తులు గోవిందమాల దీక్షాధారణ చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కలశాలతో ఉత్సవ ఆరంభ స్నపనం (క్షీరాభిషేకం), శ్రీవారి శోభాయాత్ర నిర్వహించారు. గోవిందమాలధారణ చేసిన భక్తులు బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు సేవలు అందించి, ఈ నెల 13న దీక్ష విరమణ చేస్తారని ధర్మకర్తలు తెలిపారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.



బ్రహ్మోత్సవాల ఆరంభ స్నపనం నిర్వహిస్తున్న అర్చకులు, మాలధారణ భక్తులు